

మహిళల భద్రతకు చర్యలు తీసుకోవాలి

ఏలూరు అర్బన్ : ఏలూరులోని న్యాయస్థానంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు పనిచేస్తున్న కార్యాలయంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ వారి ఆధ్వర్యంలో బుధవారం న్యాయ సేవాధికార సంస్థ భవనంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు పనిచేసే అన్ని కార్యాలయాల్లో వారికి కనీస వసతులను ఏర్పాటు చేయాలని, మహిళ వ్యక్తిగత భద్రత, రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పనిచేసే స్థానాల్లో తోటి ఉద్యోగుల వల్ల సమస్యలను ఎదుర్కొనటానికి ప్రతి కార్యాలయంలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని, ఆ కార్యాలయాల్లో కమిటీలోని సభ్యుల పేర్లను ప్రదర్శించాలని సూచించారు. అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు.

ఆర్ఎస్ ఆశయ సాధనకు.. పునరంకితమవుతాం

సంస్మరణ సభలో వక్తలు

మతోన్మాదాన్ని అంతా గుర్తించాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

కమ్యూనిస్టులు నాకు మంచి మిత్రులు
మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ



మాట్లాడుతున్న మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

ఎర్రజెండా కోసం తుది వరకూ పోరాడిన ఆర్ఎస్ ఆశయ సాధనకు పునరంకితమవుదామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) సంస్మరణ సభ ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షతన బుధవారం సాయంత్రం జరిగింది. తొలుత ఆర్ఎస్ చిత్రపటానికి మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ, శ్రీనివాసరావు, మంతెన సీతారాం తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్ఎస్ జీవన ప్రస్థానంపై ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఆర్ఎస్ అందరికీ సుపరిచితులన్నారు. జిల్లా కమ్యూనిస్టు, ప్రజా ఉద్యమంలో ఆర్ఎస్ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. రైతు, కార్మిక, గీత వంటి ఉద్యమాల్లో అల్లూరితోపాటు ఆర్ఎస్ కీలకపాత్ర పోషించారన్నారు. విద్యార్థి దశ నుంచి పోరాట పటిమతో చట్ట సభల్లో అడుగుపెట్టి ప్రజల పక్షాన ఆర్ఎస్ నిలిచారన్నారు. ఆర్ఎస్ స్ఫూర్తితో జిల్లాలో ప్రజా ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకా కృష్ణమూర్తి మాట్లాడుతూ తాను యువకునిగా ఉన్నప్పుడు ఆర్ఎస్‌తో కలిసి పని చేశానని ఆనాటి స్మృతులను గుర్తు చేశారు. పేదలు, కార్మికుల పోరాటాలతోపాటు కార్యకర్తల బాగోగులు, యోగక్షేమాలు పట్టించుకోవడంలో ఆర్ఎస్‌కు ఎవరూ సాటిరారని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం ఆర్ఎస్ కడవరకూ పోరాడారన్నారు. సభకు బి.వాసుదేవరావు ఆహ్వానం పలుకగా జెఎన్‌వి.గోపాలన్ వందన సమర్పణ చేశారు. సభలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.కళ్యాణి, కేతా గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, సీనియర్ నేత జుత్తిగ నరసింహమూర్తి, కె.రాజా రామ్మోహన్‌రాయ్, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, ఛాంబర్ మాజీ అధ్యక్షులు గుప్తా, రైస్ మిల్లర్స్ తాలుకా కార్యదర్శి కె.రాజా తదితరులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి సంచికను ఆవిష్కరిస్తున్న నేతలు

సమస్యలపై కలిసి పని చేశాం
మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ఆర్ఎస్‌తో నాకు ఎంతో సాన్నిహిత్యం ఉంది. నేను రాజకీయాల్లో అడుగుపెట్టిన సమయంలో నాకు రాజకీయ గురువు ఆర్ఎస్. రైతు, కూలీ, కార్మికుల పక్షాన ఆర్ఎస్ నిరంతరం పోరాడేవారు. పలు సమస్యలపై నేను, ఆయన కలిసి పనిచేశాం. తుందుర్రు ఆక్వా ఫుడ్‌పార్క్ సమస్య, తాగునీరు, కాలుష్యం వంటి సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేవిధంగా నాకు సూచనలు, సలహాలు అందించారు. ఆర్ఎస్ మృతి ప్రజలతోపాటు నాకూ తీరనిలోటు.

పీపుల్స్ ఎంఎల్ఎ ఆర్ఎస్
మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు



ఆర్ఎస్ 75 ఏళ్లపాటు కమ్యూనిస్టు ఉద్యమంలో ఉన్నారు. కేవలం ఐదేళ్లు మాత్రమే అనారోగ్యం రీత్యా ఇంటి వద్ద ఉన్నారు. 2018లో ఆర్ఎస్ జీవిత చరిత్ర పుస్తకాన్ని భీమవరంలో జరిగిన రాష్ట్ర మహాసభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రస్తుతం వారిద్దరూ లేకపోవడం బాధాకరం. వామపక్ష ఉద్యమానికి, కార్మికోద్యమానికి తీరనిలోటు. 1967 నుంచి 1972 వరకూ నరసాపురం ఎంఎల్ఎగా ఆర్ఎస్ పని చేశారు. నిత్యం ప్రజల పక్షానే నిలిచి పీపుల్స్ ఎంఎల్ఎగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆర్ఎస్ జైలులో ఉన్నప్పుడు నేను కమ్యూనిస్టు పార్టీలో చేరాను. యువతను ఆయన ఎంతగానో ప్రోత్సహించేవారు. అప్పట్లో ఆర్ఎస్ విష ప్రచారం చేశారు. ఆయన అభ్యుదయవాది, అంతకుమించి మానవతావాది.

ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు
బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి



ఆర్ఎస్ మృతి ప్రజా ఉద్యమాలకు, కుటుంబానికి తీరనిలోటు. అంతిమయాత్రలో వేలాది మంది పాల్గొని ఘనంగా నివాళులర్పించడం ఆర్ఎస్ పట్ల ఉన్న అభిమానానికి నిదర్శనం. చించినాడలో నాటి కసాయి కాంగ్రెస్ ప్రభుత్వం ఐదుగురిని కాల్చి చంపడంతో ఆర్ఎస్ ఉద్యమ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేశారు. సిపిఎం ఉద్యమ నిర్మాణంలో అల్లూరితోపాటు ఆర్ఎస్ ముఖ్యపాత్ర వహించారు.

ఆదర్శ నేత ఆర్ఎస్
మెంటే పార్థసారథి, టిడిపి రాష్ట్ర కోశాధికారి



జిల్లాలో ఆర్ఎస్ అనేక ఉద్యమాలు నిర్వహించారు. కమ్యూనిస్టు నేతగా పోరాటాల్లో నీతి, నిజాయతీ, నిబద్ధతతో పని చేశారు. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారు. దాదాపు వందేళ్లపాటు జీవించిన ఆర్ఎస్ ఆదర్శవంతమైన నేత.

తెరిచిన పుస్తకం ఆర్ఎస్
కోనాల భీమారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి



కులమతాలు, అసమానతలు రూపుమాపేందుకు ఆర్ఎస్ నిరంతరం పాటుపడ్డారు. భిన్నత్వంలో ఏకత్వం నినాదంతో ముందుకు సాగారు. బడుగు బలహీనవర్గాలు, కార్మికుల హక్కుల కోసం పోరాడారు. రైతాంగ పోరాటాలు, ప్రధానంగా గిట్టుబాటు ధర సాధనకు బలమైన పోరాటాలు సాగించారు. ఆర్ఎస్ అంటే చైతన్యం, నమ్మకం, స్ఫూర్తి. మొత్తంగా చెప్పాలంటే ఆయన ఒక తెరిచిన పుస్తకం.

ఐక్యంగా ఉద్యమాలు సాగించాలి
కాటం నాగభూషణం, ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి



ఆర్ఎస్ స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు సాగించాలి. జిల్లాలో సిపిఎం అభివృద్ధిలో కీలకపాత్రదారుల్లో ఆర్ఎస్ ఒకరు. శాఖా సమావేశాలకు ఆర్ఎస్ వచ్చి రాజకీయ రిపోర్టు చెప్పి అందరినీ ఉద్యమాల బాట పట్టించేవారు. కేడర్ కుటుంబాల పట్ల అత్యంత ఆప్యాయత, ప్రేమాభిమానాలు చూపేవారు. చించినాడ తరహా ఉద్యమాలను జిల్లాలో ఐక్యంగా సాగించాలి.

రైస్‌మిల్లర్స్‌కు పెద్దదిక్కు ఆర్ఎస్
కొత్త శ్రీనివాస్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి



రైస్‌మిల్లుల్లో కార్మికులకు, యాజమాన్యాలకు అగ్రిమెంట్లు ఉంటాయి. ఈ సమయంలో ఆర్ఎస్ వస్తే తాము వినడమే తప్ప చెప్పడానికి ఏమీ ఉండదని యాజమాన్యాలు చెబుతుండేవి. ఒకసారి అగ్రిమెంట్‌కు కార్మికుల పక్షాన ఆర్ఎస్ వచ్చినప్పుడు నేను మొదటిసారి ఆర్ఎస్‌ను చూశాను. యజమానులకు, కార్మికులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా అగ్రిమెంట్ ఆయన చేశారు. ఆర్ఎస్ రైస్‌మిల్లర్స్ అందరికీ పెద్ద దిక్కుగా ఉండేవారు. ఆయన లేకపోవడం బాధాకరం.

సూచనలు, సలహాలిచ్చేవారు
ఆర్‌విఎస్.రాజు, గణపవరం ఛాంబర్ అధ్యక్షులు



జిల్లా ప్రజల్లో ఆర్ఎస్‌ది సుస్థిరస్థానం. సిద్ధాంతపరంగా ఎక్కడా రాజీపడని మనస్తత్వం ఆర్ఎస్ సొంతం. ఆర్ఎస్ స్ఫూర్తి నేటి తరానికి ఎంతో అవసరం. సామాజిక ఉద్యమాల్లో ఆర్ఎస్ నాకు అనేక సూచనలు, సలహాలిచ్చేవారు.

చించినాడ పోరాట స్ఫూర్తి ఎనలేనిది
కూనపు రాజు కుమార్, ప్రముఖ రచయిత



70 ఏళ్ల క్రితం తెలంగాణా సాయుధ పోరాట సమయంలో చించినాడలో ఐదుగురిని కాల్చి చంపారు. అనంతరం ఆ గ్రామంలో సాగిన పోరాటాలు అత్యంత స్ఫూర్తిదాయకం. చించినాడ పోరాటాలను, ఆర్ఎస్‌ను వేరుచేసి చూడలేం. నిరంతర పోరాట స్ఫూర్తిదాయకులు ఆర్ఎస్.

ఆర్ఎస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - యలమంచిలి

ఆర్ఎస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని చించినాడ గ్రామంలో ఇటీవల మరణించిన సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) సంస్మరణ సభ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న అమరవీరుల స్తూపంపై జెండాను శ్రీనివాసరావు ఆవిష్కరించగా అమరవీరుల శిలాఫలకానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం నివాళులర్పించారు. ముందుగా ఆర్ఎస్ చిత్రపటానికి, సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అసాధారణ పటిమ కలిగిన ఆర్ఎస్ కమ్యూనిస్టు సిద్ధాంతాలను తూచా తప్పకుండా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పార్టీ ఉద్యమాన్ని బలోపేతం చేశారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడారు. ఆర్ఎస్ ఒక కమ్యూనిస్టు మాత్రమే కాదని, ఆయన ఒక గొప్ప మానవతావాది అని తెలిపారు. ఆయనను చూసి ఎన్నో విషయాలు నేర్చుకున్నామని తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఊహ తెలిసిన నాటి నుండి ఊపిరి ఆగిపోయే వరకూ గొప్ప కమ్యూనిస్టు నాయకునిగా పేద ప్రజల కోసమే జీవించిన ఆర్ఎస్ వంటి గొప్ప నాయకుడు జీవితాన్ని భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చించినాడలో ఉద్యమాన్ని నిర్మించడానికి ఆర్ఎస్ చేసిన కృషి అమోఘమని అన్నారు. అటువంటి నాయకుడి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడారు. దళితులు, వెనుకబడిన వర్గాల్లోని ప్రజలకు అధికారులు, అన్యాయం చేస్తే వారిపై ఎదురు తిరిగి ప్రశ్నించే స్వభావాన్ని ధైర్యంగా ముందుకు సాగే పరిస్థితులను ఆర్ఎస్ ద్వారానే కలిగిందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఆర్ఎస్ జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పొగాకు పూర్ణ, ఆర్ఎస్ కుమార్తెలు సుశీల, స్వరాజమాత, అల్లుళ్లు నరసింహ రాజు, రామకృష్ణంరాజు, కృష్ణమూర్తి రాజు, గ్రామ మాజీ సర్పంచి ఆర్ఎస్ తమ్ముడు కుమారుడు రుద్రరాజు సత్యనారాయణరాజు, ఆర్ఎస్ సహాయకులు విజయ, గ్రామ మాజీ ఉప సర్పంచి హృదయరాజు సత్యనారాయణ రాజు (వైజాగ్‌రాజు) పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ఆర్ఎస్‌తో 60 ఏళ్ల అనుబంధం
సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు



ఆర్ఎస్‌తో 60 ఏళ్ల ఉద్యమ అనుబంధం ఉంది. ఆయన అమరులైన ఐదుగురు కమ్యూనిస్టుల తరువాత పార్టీని ఈ స్థాయిలో నిర్మించడానికి ఆర్ఎస్ చేసిన కృషే కారణం.

20 టన్నుల ఇసుక.. రూ.23 వేల పైనే..!

- బుకింగ్ కోసం అల్లాడిపోతున్న ఇళ్ల నిర్మాణదారులు
- బుకింగ్ కోసం నానా తంటాలు
- 1, 2 రోజుల్లో సరఫరా ఉత్తిమాటే
- కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట స్టాక్‌పాయింట్‌లో మాత్రమే ఇసుక
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక కష్టాలపై జనం ఆగ్రహం

ఇసుక కష్టాలు జనాన్ని వెంటాడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక కష్టాలు వర్ణాతీతంగా మారాయి. టన్ను ఇసుకకు రూ.1,100లకుపైగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుకింగ్ కష్టాలు, సరఫరాలో తీవ్ర జాప్యంతో నిర్మాణదారులు విసిగిపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు మాత్రం ఉచిత ఇసుక భేష్ అంటూ కబుర్లు చెబుతూ కాలక్షేపం చేస్తున్న తీరుపై జనాగ్రహం పెల్లుబుకుతోంది. ఇసుక కష్టాలు తీరేదెన్నడు అని జనం తలపట్టుకుంటున్న పరిస్థితి రెండు జిల్లాల్లో కొనసాగుతోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



గత ప్రభుత్వ హయాంలో 20 టన్నుల ఇసుక రూ.18 వేలకు కొనుగోలు చేస్తే.. ఉచిత ఇసుక అంటూ చెబుతున్న కూటమి ప్రభుత్వం మాత్రం 20 టన్నుల ఇసుకకు రూ.23,260 వసూలు చేయడంపై జనాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఇసుక కొనుగోలు జరుగుతున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక కష్టాలు నిర్మాణదారులకు వర్ణాతీతంగా మారాయి. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు మండలం చేబ్రోలు, కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట, వింజరంలో మూడు స్టాక్ పాయింట్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఒక్క ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ నుంచి తప్ప ఎక్కడా ఇసుక సరఫరా చేయడం లేదు. భద్రాచలం దగ్గర్లో కుక్కునూరు మండలం ఉంది. ఇబ్రహీంపేట నుంచి ఏలూరుకు ఇసుక బుక్ చేసుకుంటే 20 టన్నులకు రూ.23,260 కట్టాల్సి వస్తోంది. దీంతో నిర్మాణదారులు గగ్గోలు పెడుతున్నారు. అంత ధర పెట్టి కొనుగోలు చేయలేక లబోదిబోమంటున్నారు. అంతేకాకుండా ఈ నెల 19వ తేదీన ఇసుక బుకింగ్‌కు సంబంధించి ప్రత్యేక పోర్టల్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. జిల్లా అధికారులు సైతం పోర్టల్ గురించి గొప్పగా చెప్పారు. ఎపి శ్యాండ్ మ్యానేజ్ మెంట్ సిస్టం పోర్టల్‌లో ఇసుక బుక్ చేసుకుంటే ఒకటి లేక రెండు రోజుల్లో ఇసుక సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఏలూరులోని కొంత మంది నిర్మాణదారులు 19వ తేదీన ఇసుక బుక్ చేసుకుంటే ఐదు రోజులు గడిచినా ఇసుక చేరని పరిస్థితి నెలకొంది. లారీ యాజమానులకు ఇప్పటికే రవాణా చేసిన ఇసుకకు ప్రభుత్వం సొమ్ములు చెల్లించకపోవడంతో లారీలు పెట్టడం లేదని చెబుతున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్లు సరిగ్గా పనిచేయడం లేదని జనం గగ్గోలు పెడుతున్న పరిస్థితి నెలకొంది. గతంలోకంటే 20 టన్నుల ఇసుకకు రూ.ఐదు వేలకు పైగా అదనంగా చెల్లించాల్సి రావడంతో ఇళ్లు నిర్మించుకునే సామాన్య ప్రజానీకానికి పెనుభారంగా మారింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు లేవు. పూర్తిగా తూర్పుగోదావరి జిల్లా స్టాక్‌పాయింట్లపైన ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండే పందలపర్రు, పెండ్యాల స్టాక్‌పాయింట్లలో ఇసుక లేదని ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. ఇంకా దూరంగా ఉన్న స్టాక్‌పాయింట్లలో బుక్ చేస్తే ఛార్జీల భారం పెద్దఎత్తున అవుతోంది. దీంతో రెండు జిల్లాల ప్రజానీకం ఇసుక కోసం పడుతున్న పాట్లు వర్ణాతీతం. ఇసుక సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

	Particulars	Quantity (MTs)	Price (₹ Per MT)	Total (₹)
	Towards cost of sand	20 MT	0.00	0.00
	Cost of operations	20 MT	102.48	2,049.52
	Statutory Levies	20 MT	88.00	1,760.00
	Transportation Charges			18,342.86

	Particulars	Quantity (MTs)	Price (₹ Per MT)	Total (₹)
		Total Taxable Value(1+2+3+4) :		22,152.38
	...venty Three Thousand Two ...dred and Sixty Rupees Only	CGST @ 2.5% :		553.81
		SGST @ 2.5% :		553.81
		Total Amount to be Paid :		₹ 23,260.00

ఇబ్రహీంపేట నుంచి ఇసుక సరఫరాకు ఆన్‌లైన్ ధర ఇలా

ఉపాధి లేక అల్లాడుతున్న కార్మికులు..

ఇసుక కొరతతో భవన నిర్మాణ పనులు పూర్తిగా మందగించాయి. నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. దీంతో రెండు జిల్లాల్లో దాదాపు రెండు లక్షల మంది కార్మికులకు పనులు లేకుండా పోయాయి. తాపీ పనివారు పనిలేక ఖాళీగా ఉంటున్నారు. నిర్మాణరంగంలో 32 పనులకు సంబంధించిన వారు ఆధారపడి ఉన్నారు. పెయింటర్లు, వడ్రంగి, సెంట్రింగ్ పనివారు ఇలా అనేక రంగాల వారికి పనిలేకుండా పోయింది. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు కావడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటినా ఇసుక సమస్యను పరిష్కరించలేదు. దీంతో పనిలేక అల్లాడుతున్న కార్మికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇసుక సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంతా డిమాండ్ చేస్తున్నారు.

గంజాయి, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి
రేంజ్ ఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - పోలవరం


గంజాయి, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ఏలూరు రేంజి ఐజి జివిజి అశోక్‌కుమార్ తెలిపారు. ఎస్‌పి కిషోర్‌కుమార్‌తో పోలవరం సబ్ డివిజనల్ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఐజి మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో మావోయిస్టుల కదలికలు ఉన్న దాఖలాలు ఉన్నట్లు తమ దృష్టికి రాలేదన్నారు. గిరిజన గిరిజనేతర, భూవివాదాలు, జీలుగుమిల్లి, కొయ్యల గూడెం పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేస్తే సైబర్ నేరాలు జరిగిన వెంటనే స్పందించి సొమ్ము రికవరీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, సిఐ బాల సురేష్‌కుమార్, ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్టులో భద్రతా ఏర్పాట్లను ఐజి పరిశీలించారు.


మాట్లాడుతున్న ఐజి అశోక్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ సిద్ధం
కలెక్టర్ వెట్రి సెల్వి, ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి జిల్లాలో రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల్లో సమర్థవంతమైన టీం ఉండడం వల్ల సాధ్యమైందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మండలంలోని పోతునూరు స్వరాజ్ భవన్‌లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శానిటేషన్‌కు ప్రాధాన్యతివ్వడం ద్వారా ఎప్పుడూ ప్రథమ స్థానంలో ఉంటున్నామన్నారు. అందరి సహకారంతోనే వరదల్లో ప్రాణనష్టం తగ్గించగలిగామన్నారు. పంట తదితర నష్టాలకు సంబంధించి ప్రభుత్వం అందించే పరిహారం బాధితుల ఖాతాలోకి జమ అవుతాయన్నారు. ఇందులో భాగంగా బుధవారం ముఖ్యమంత్రి మన జిల్లాకు సంబంధించి రూ.7 కోట్లు సంబంధిత రైతుల ఖాతాలకు విడుదల చేశారని తెలిపారు. చెరువులకు జరిగిన నష్టాన్ని పూడ్చి తిరిగి వాటిని వాడుకలోకి తీసుకొస్తామన్నారు. వరదల సమయంలో ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ కృషి అభినందనీయమన్నారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ జిల్లాలో వరదలను జిల్లా కలెక్టర్ సమర్థవంతంగా అధిగమించారన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పథకాల అమల్లో కలెక్టర్ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ, దెందులూరు మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఆర్‌డిఒ ఎన్ఎస్ కె.ఖాజావలీ, ఎంపిడిఒ శ్రీలత, తహశీల్దార్ సుమతి, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి
కాంగ్రెస్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద త్తాలీ బజావో

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కాంగ్రెస్ జిల్లా ఇన్‌ఛార్జి వింతా సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం త్తాలీ బజావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ఇన్‌ఛార్జి సంజీవరెడ్డి మాట్లాడుతూ తాము కొత్తగా ఏమీ అడగడం లేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, మరి ఎక్కడ అమలు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్, మాజీ ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే ప్రజల పక్షాన నిలబడే పార్టీ అన్నారు. కూటమి ప్రభుత్వం గెలిచిన మరుక్షణమే రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చిందని, వంద రోజులైనా ఆ మాటలు గాలికొదిలేసిందని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగానే హంగు, ఆర్భాటాలకు, ప్రచారాలకు ఇచ్చే ప్రాధాన్యత ప్రజల సంక్షేమానికి ఇవ్వడం లేదన్నారు. అధికారంలోకి రావడానికి ముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పథకాలు అమలు చేయాలంటే భయమేస్తోందని స్వయంగా ముఖ్యమంత్రి మాట్లాడడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. తక్షణం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గౌతు సత్యేంద్రబాబు, మద్దాల ప్రసాద్, ఏలూరు జిల్లా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు ఆలపాటి నరసింహమూర్తి, మరిది కృష్ణ, బొడ్డు నోబెల్, పెద్దిరెడ్డి సుబ్బారావు, కొల్లి రామసూరిరెడ్డి, ప్రగళ్లపాటి కాశి, బొడ్డు వాసు, ఆకుల ఏసుబాబు, బండి భాస్కర్, అల్లి కిషోర్, ముచ్చక సీత, మాదాల బాబూరావు, సరిపెల్లి పెద్దిరాజు, యోహాన్ రాజు, డి.చంద్రశేఖర్, గణపతి, సేవాదళ్ సుబ్బారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా ఇన్‌ఛార్జి సంజీవరెడ్డి

చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేస్తా

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి నూజివీడు నియోజకవర్గ ప్రజల కలను సాకారం చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు. మండలంలోని పల్లెర్లమూడిలో బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా మూలన పడిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తిచేసి నియోజకవర్గ ప్రజలు, రైతులకు సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వరద బాధితుల సహాయార్థం మంత్రి పార్థసారధికి పలువురు విరాళాలు అందించారు. పట్టణంలోని టిడిపి నాయకులు రూ.1.26 లక్షల చెక్కును అందించారు. సీతారాంపురం గ్రామ పెద్దల తరపున రూ.1.45 లక్షల చెక్కును, రాము అనే వ్యక్తి రూ.25 వేల చెక్కును అందించారు.

ఆదర్శప్రాయులు జ్యోతిరావు పూలే దంపతులు

ప్రజాశక్తి - ఏలూరు

సమాజాన్ని చైతన్యవంతం చేయడం కోసం జ్యోతిరావు పూలే దంపతులు సత్యశోధన సమాజాన్ని ఏర్పాటు చేశారని, వారి ఆదర్శం మనమంతా కొనసాగించాలని బిసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, భారత్ బచావో జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు అన్నారు. సత్యశోధన సమాజం ఏర్పడి 151 సంవత్సరాలు, పూలే దంపతులచే కామన్ స్కూల్ 175 వార్షికోత్సవ సందర్భంగా ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి వార్తోత్సవ సంయుక్తంగా కస్తూరిబా బాలికల హైస్కూలులో బుధవారం సభ నిర్వహించారు. సభలో ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి గుబ్బల నాగేశ్వరరావు, జి.రాంబాబులు పూలమాల వేయగా హాజరైన అందరూ జోహార్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు జి.సునీత అధ్యక్షత వహించారు. ఈ భారత్ బచావో జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు గుబ్బల నాగేశ్వరరావు, పి.రవీంద్ర, మానవత ఏలూరు మండలాభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ మేతర అజయ్ బాబు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యురాలు కె.జనని, స్కూల్ టీచర్స్ సుశీల పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కైకరం విద్యార్థులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని కైకరం జెడిపి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏడుగురు ఎంపికయ్యారు. ఈ నెల 24 ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ అథ్లెటిక్స్ జిల్లా పోటీల్లో కైకరం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కైకరం జెడిపి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.ప్రసాదరావు వెల్లడించారు. అక్టోబరు 5న రాజమహేంద్రవరం ఆర్ట్ కాలేజీలో జరిగే స్టేట్‌మీట్‌లో ఈ విద్యార్థులు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారన్నారు.

ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని విక్టోరియా పుర మందిరం ఆవరణలోని క్రీడా మైదానంలో బుధవారం ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు. ముందుగా ఉమ్మడి కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక కోసం పోటీలను డివిజనల్ ఉప విద్యాశాఖాధికారి సేవ్యా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ 14, 17 విభాగాలకు చెందిన బాల బాలికలను విడివిడిగా ఉమ్మడి కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిఈటీ, కోచ్ డాక్టర్ వాకా నాగరాజు, కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ దాసరి శ్రీనివాసరావు, ఎన్‌టిఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, నూజివీడు సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎస్.లక్ష్మి, ఏలూరు జిల్లా పి.సుగుణరావు, పి.రవీంద్ర, బి.సుకుమార్, అన్నామని, వి.వనజ, డి.సతీష్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు : ఉమ్మడి జిల్లా పరిధిలో అండర్–14 అండర్–17 బాల బాలికల బాస్కెట్‌బాల్ సబ్ జోన్ ఆటల పోటీలను డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి సేవియా నాయక్ బుధవారం ప్రారంభించారు. అండర్–14, అండర్–17 విభాగంలో బాలికలను, బాలురను విడివిడిగా వ్యాయామ ఉపాధ్యాయులు ఆటలను నిర్వహించివారిలో ప్రతిభ గల వారిని ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజు తెలిపారు. ఈ పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎస్.లక్ష్మి, ఏలూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సెక్రటరీ పి.సుగుణరావు, పి.రవీంద్ర, బి.సుకుమార్, అన్నామని, వి.వనజ, డి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

దూర విద్యలో ప్రవేశాలు

ప్రజాశక్తి - చాట్రాయి

వివిధ కారణాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువు మధ్యలోనే మానేసిన విద్యార్థులు, గృహిణులు తిరిగి చదువుకునేందుకు సార్వత్రిక విద్య దోహదపడుతుందని చాట్రాయి ఎంఇఒ విఎస్‌వి.బ్రహ్మాచారి అన్నారు. చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అంగన్‌వాడీ, మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ దూరవిద్యలో ప్రవేశాలు, అభ్యాసం తదితర విషయాలను వివరించారు. 14 ఏళ్ల వయస్సు కలిగి, చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు ఓపెన్ టెన్త్, 16 ఏళ్లు నిండి, పదో తరగతి పాసైనవారు ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసించవచ్చన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి అభ్యసించేందుకు అవకాశముందని చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం డి.కృష్ణయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గాయత్రి పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన భూ సమస్యలు పరిష్కారం కావాలంటే సిపిఎంను బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు నాయకులకు దిశానిర్దేశం చేశారు. మండలంలోని దిబ్బగూడెంలో సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా మండలవ్యాప్తంగా అనేక భూ పోరాటాలు చేసి గిరిజన సమస్యలను పరిష్కరించిన ఘనత సిపిఎంకే దక్కుతుందన్నారు. అనంతరం గ్రామ నూతన కమిటీ కార్యదర్శులుగా గుండె గంగరాజు, కొవ్వసి రామలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రపంచ ఫార్మసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీడు టౌన్‌లో ఉన్న శ్రీ సిద్ధార్థ ఫార్మసీ కాలేజీ వద్ద బుధవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి నూజివీడు ఎస్ఐ పి.సత్యశ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు సమతుల్యమైన ఆహారం తీసుకోవాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. సెల్‌ఫోన్లను అవసరం మేరకే వినియోగించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ ఫార్మసీ కాలేజీ విద్యార్థులు, నూజివీడు టౌన్ ఎఎస్ఐ ఖాసిం బేగ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

చింతలపూడి : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని చింతలపూడి ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు అప్పలరాజు అన్నారు. జిల్లాలో జరిగిన జిల్లా అథ్లెటిక్స్ క్రీడా పోటీలో బెస్ట్ అథ్లెటిక్స్‌గా మండలంలోని యర్రంపల్లి గ్రామానికి చెందిన హోమ్ గార్డ్ సూరిబాబు తనయుడు తమ పాఠశాలకు చెందిన ప్రణిత్ మొదటి స్థానం సాధించాడని చెప్పారు. విద్యార్థులు క్రీడలపై కూడా ఆసక్తి చూపించాలన్నారు. ప్రణిత్‌ను ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, ఎం.రమాదేవి అభినందించారు.

నేరాలు – ఘోరాలు

బైక్‌ల చోరుడు అరెస్టు

చాట్రాయి : ద్విచక్రవాహనాలు చోరీ చేసే వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు అతని వద్ద నుంచి 13 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. చాట్రాయి పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకర్ల నూజివీడు సిఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలో తరచూ ద్విచక్రవాహనాల చోరీలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మేరకు ఫిర్యాదులు వచ్చాయి. చాట్రాయి ఎస్ఐ డి.రామకృష్ణ అతని సిబ్బందితో ద్విచక్రవాహనాలు దొంగిలించిన పోలవరం గ్రామానికి చెందిన కోట రవిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 13 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. రవిపై కేసు నమోదు చేసి తిరువూరు కోర్టుకు హాజరు పరిచినట్లు సిఐ తెలిపారు.

ఘనంగా బాలు పాటల స్వరాంజలి

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌పి బాలసుబ్రాహ్మణ్యం నాలుగో వర్ధంతి, ఉన్నవ లక్ష్మీనారాయణ 66వ వర్ధంతి సందేశాత్మక పాటలు పోటీ, బాలు పాటల స్వరాంజలి పెద్దఎత్తున నిర్వహించారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, హేలాపురి సింగర్స్ కమిటీల ఆధ్వర్యంలో నవ చైతన్యం కార్యక్రమంలో భాగంగా సాహిత్య మండలిలో వార పాడిన సందేశాత్మక సినీ పాటల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హేలాపురి సింగర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రవి స్వాగతం పలికారు. ముందుగా మాలపల్లి నవలా రచయిత అభ్యుదయ వాది ఉన్నవ లక్ష్మీనారాయణ చిత్రపటానికి నవచైతన్యం కమిటీ కన్వీనర్ కూచిపూడి సత్యనారాయణ, ఎస్‌పి బాలసుబ్రమణ్యం చిత్రపటానికి హేలాపురి సింగర్ ఎం.శ్రీవల్లి పూలమాలలు వేశారు. కార్యక్రమానికి ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, హేలాపురి బాలోత్సవం కమిటీ పెద్దలు విజిఎంవిఆర్.కృష్ణారావు, ఎస్.కస్తూరిరావ్, శ్రీహరికోటి దేవరకొండ వెంకటేశ్వర్లు గుబ్బల నాగేశ్వరరావు, సాయిచమండలి కార్యదర్శి పి.పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు. బాలు పాడిన సందేశాత్మక సినీ పాటలు పాడిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

దోమ లార్వాలను నిర్మూలించాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దోమ లార్వాలను నిర్మూలించడం ద్వారా దోమల వృద్ధిని కొంతవరకు అరికట్టుకోవచ్చని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక తంగెళ్లమూడిలోని కంద్రికగూడెంలో ప్రజలకు దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ దోమలు నిర్మూలించడం కంటే దోమ పిల్లలైనా లార్వాలను నిర్మూలించడం తేలికన్నారు.

ఇంక్రిమెంట్లు, జీతం ఇవ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పబ్లిక్ హెల్త్ వర్కర్స్ ఎనిమిది మంది, ఇంజినీరింగ్ సెక్షన్‌లో ఒకరు మొత్తం తొమ్మిది మందికి డ్రైవర్స్‌గా ప్రమోషన్ ఇచ్చి రెండున్నరేళ్లుగా పూర్తయినా ఇంక్రిమెంట్లు ఇవ్వలేదని, పెరిగిన జీతం ఇవ్వడం లేదని ఎఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు చెప్పారు. ఈ మేరకు బుధవారం ఏలూరు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే తొమ్మిది మందికి ఇంక్రిమెంట్స్ చేయాలని, పెరిగిన వేతనాలు చెల్లించాలని కోరారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని అల్లిపల్లి వసతి గృహంలో బాలికలకు బుధవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపూడి సిఐ రవీంద్ర మాట్లాడుతూ పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే 112కు తెలిపితే పోలీసులు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - చాట్రాయి

మండల కేంద్రమైన చాట్రాయిలో వ్యవసాయ శాఖాధికారి బి.శివశంకర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులను, పంటల యాజమాన్యం గురించి, పంటలకు కలుగు చీడపీడలు వాటి నివారణ గురించి వివరించారు. సూక్ష్మ పోషకాల విలువలు సమగ్ర పోషక యాజమాన్యం గురించి వ్యవసాయ శాఖ ఉద్యాన శాఖ ద్వారా అందించే డ్రిప్ పరికరాలు మార్చి మిరప శాశ్వత పందిరులు వాటి రాయితీ వివరాలను రైతులకు తెలిపారు. అనంతరం వరి క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు తగు సూచనలు చేశారు.

ముదినేపల్లి : రైతులందరూ మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయ శాఖాధికారి బి.వేణుమాధవ్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండలంలోని దాకారం, పెయ్యేరు శివారు అప్పారావుపేట గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుమాధవ్ మాట్లాడుతూ పలు సూచనలు, సలహాలు చేశారు.

నూజివీడు టౌన్ : మండలంలోని బోర్వంచా తూర్పు దిగువల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి చాముండేశ్వరి మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ఆర్.హేమ, కిసాన్ సభ మండల కోఆర్డినేటర్ ఎం.భూలక్ష్మి పాల్గొన్నారు.

పెదపాడు : మండలంలోని వీరంగుంటలో రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని డిపార్టెమెంట్‌ల మండల అధికారులు పాల్గొని వారి శాఖల ద్వారా అందిస్తున్న అన్ని రకాల సబ్సిడీలు, పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.ప్రదీప్‌కుమార్ పలు సూచనలు చేశారు.

ఉంగుటూరు : వ్యవసాయంలో ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుని ఉత్తమ యాజమాన్య పద్ధతులతో సాగు లాభదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి ఎన్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాగుపాడు, రావులపర్రు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ సాయంతో క్రిమి సంహారికి మందులు పిచికారీ విధానాన్ని చేసి చూపించారు.

జీలుగుమిల్లి : రైతులు పండించే పంటల్లో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయ అధికారి కె.గంగాధర్ రైతులకు సూచించారు. మండలంలోని అంకన్నగూడెం, రాచన్నగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఉద్యానవన శాఖ అధికారిణి నవీనతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలకు రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలని రైతులకు సూచించారు.

చింతలపూడి : ప్రస్తుతం వరి పంటలో బ్యాక్టీరియా, ఎండు తెగులు ఎక్కువగా ఉంటుందని చింతలపూడి మండల వ్యవసాయాధికారి మీనా కుమారి తెలిపారు. ఆకుల అంచుల నుంచి కొంకి వైపునకు పసుపు రంగుకు మారతాయన్నారు. ఈ బ్యాక్టీరియా కలుపు మొక్కలపై ఉంటుందని, గట్లపై కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నత్రజని సిఫార్సుకు మాత్రమే వాడాలన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు.

కొత్త పట్టిసీమలో 'స్వచ్ఛతా హి సేవ'

పోలవరం : మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామపంచాయతీలో సర్పంచి మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో బుధవారం తొమ్మిదో రోజు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాలు శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వద్దు కాటన్ ముద్దు, రోడ్లపై చెత్త వేయకు పర్యావరణాన్ని పాడుచేయకు అంటూ నినాదాలు చేస్తూ ఇంటింటికి వెళుతూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎ.సుబ్రహ్మణ్యం, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగనవాడీ వర్కర్స్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత

మంత్రి కొలుసు పార్థసారధి


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్రంలో దెబ్బతిన్న రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ.1.70 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.23.40 కోట్లతో బొమ్ములూరు వరకు కృష్ణా జిల్లాలో గల రహదారి వెడల్పు పటిష్టపరచిన రహదారిని ప్రారంభించారు. మండలంలోని సీతారాంపురం, పల్లెర్లమూడి, మీర్జాపురం గ్రామాల్లో రూ.1.70 కోట్లతో నిర్మించనున్న పలు సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడచూసినా గోతులు పడిన రోడ్లు దర్శనమిచ్చాయన్నారు. అటువంటి రోడ్లపై ప్రయాణాలతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రవాణా, రహదారులు బాగుంటేనే అభివృద్ధికి బాటలు పడతాయన్నారు. వర్షాలు పూర్తిగా తగ్గిన తరవాత నుంచి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టి, త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. జిలాల్లోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఎస్ఇ జాన్ మోషే, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ భాస్కరరెడ్డి, పంచాయతీ రాజ్ డిఇలు స్థానిక నాయకులు, వివిద శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో ఆధునిక టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహిస్తాం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

వ్యవసాయ ఆధునిక సాంకేతిక పద్ధతులను, పరిజ్ఞానాన్ని రైతులకు అందించే దిశగా వ్యవసాయశాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. మండలంలోని పోతునూరులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌తో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి పాల్గొన్నారు. పంట పొలాలు పరిశీలించి ఆయా పంటలకు సోకుతున్న తెగుళ్లు, సస్యరక్షణ చర్యల గురించి వ్యవసాయశాఖాధికారులు, రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉండి ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులను చైతన్యపరచాలన్నారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం రైతుల సంక్షేమ దిశగా అడుగులు వేస్తుందన్నారు.

పామాయిల్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పామాయిల్ గెలలు, మట్టలు నరికే కార్మికులకు ప్రభుత్వమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పామాయిల్ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన కాంతయ్య మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. కాంతయ్య మృతికి సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో పామాయిల్ కార్మికులు ఈ కాలంలో రకరకాల ప్రమాదాలతో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదివేల నుంచి 20 వేల మంది కార్మికులు ఉన్న ఈ జిల్లాలో ప్రభుత్వం వారి సంక్షేమం గురించి పట్టించుకోవడంలేదని విమర్శించారు. పామాయిల్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

వంద రోజుల పని కల్పించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదే

డ్వామా పీడీ రాము

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రతి జాబ్ కార్డుదారునికి వంద రోజుల పని కల్పించేలా క్షేత్ర సహాయకులు చిత్తశుద్ధితో పని చేయాలని డ్వామా పీడీ ఎ.రాము అన్నారు. ఉపాధి హామీ చట్టంలో ఉంగుటూరు మండలంలో జరిగిన పనులపై 16వ విడత సోషల్ ఆడిట్ పబ్లిక్ హియరింగ్ బుధవారం ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకూ 1894 వర్కులు చేశారు. ఇందుకోసం 4,43,336 మంది కూలీలకు పని కల్పించి వారికి రూ.12,5,87,393 వేతనాలు ఇవ్వగా మెటీరియల్ కంపోనెంట్‌గా రూ.81,66,322 పనులు మొత్తం కలిపి రూ.12.82 లక్షలు వెచ్చించారు. నాచుగుంటలో పలు ఇళ్లకు బేసిమెంట్ వరకూ నిర్మించినా ఎక్కువ రోజులు మస్తర్లు వేసినట్లు డిఆర్‌పి గుర్తించారు. సీసీ రోడ్లు నిర్మించాక మార్జిన్ షోల్డర్స్ లేవని కాని బిల్లులు రూ.53,330 ఇచ్చేసినట్లు గుర్తించినట్లు ఆడిట్ సిబ్బంది చెప్పారు. పలు చోట్ల మస్తర్లు తేడాలున్నట్లు వెల్లడైంది. అప్పారావుపేటలో బళ్ల రామారావు మృతి చెందినా మస్తర్లు వేసి రూ.1,248 వేతనం పక్కదారి పట్టింది. చేబ్రోలులో ఇంకుడు గుంత (సోపిట్స్) 105 మంజూరైతే 35 వాటికి ఇచ్చిన బిల్లుల్లో, మెటీరియల్‌లో తేడాలను గుర్తించారు. అక్కు పల్లిగోకవరం ఉపాధి పనులపై ఏడాది నుంచి పిఒ వెరిఫికేషన్ జరగకపోవడంపై సంబంధించి ఎపిఒ మల్లేశ్వరరావుపై పీడీ అసహనం వ్యక్తం చేశారు. వంద రోజుల పనికల్పనలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టిఎ, ఎపిఒలుసమన్వయంతో పనిచేయాలని పీడీ ఆదేశించారు.

గృహ నిర్మాణ లక్ష్యం పూర్తి చేసేందుకు కృషి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండలంలో గృహ నిర్మాణ నిర్ణీత లక్ష్యాలు నూరుశాతం పూర్తి చేసేందుకు కృషి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. 2014 –19 ఆర్థిక సంవత్సరాల మధ్య మంజూరై నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న లబ్ధిదారులను చైతన్య పరిచేందుకు ప్రభుత్వం ఈ నెల 28వ తేదీన మన ఇల్లు మన కుటుంబం అవగాహనా సదస్సును ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో గ్రామాలవారీగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు ప్రత్యేకాధికారులు నియామకం చేశారు. ఈ క్రమంలో భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపిడిఒ, గృహ నిర్మాణ సంస్థ ఇన్‌ఛార్జి సహాయ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావుతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవసరమైన నాణ్యమైన నిర్మాణ సామగ్రిని రాయితీపై అందిస్తుందని తెలిపారు. ఇదే క్రమంలో ప్రతి లబ్ధిదారునకు గహ నిర్మాణం కోసం ఐకెపి ద్వారా రూ.35 వేల వరకు రుణాలను అందిస్తున్నారని చెప్పారు. గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజినీర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 2014–19 సంవత్సరాల మధ్య 970 గృహ నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయన్నారు. వాటికి బిల్లుల చెల్లింపు ఇప్పటివరకు జరగలేదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటిని సర్వే చేసే కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మించాలని ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మించాలని ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గరిక అఖిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు చిన్న గాంధీ బొమ్మ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా డిగ్రీ కళాశాల లేక పేద మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పట్టణంలో ఒకప్పుడు డిఎఆర్ ఎయిడెడ్ కళాశాల అందుబాటులో ఉండేదన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న దుర్మార్గమైన నిర్ణయాల వల్ల ఎయిడెడ్ కళాశాల ప్రయివేట్ కాలేజీగా రూపాంతరం చెందిందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మించాలని, విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ టౌన్ సెక్రటరీ గోపీసాయి, నాయకులు పాల్గొన్నారు.

మెస్‌ల పనితీరు పూర్తిస్థాయిలో ప్రక్షాళన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటిలో మెస్‌ల పనితీరు పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తున్నామని, మెస్‌లో ఆహారం వండి పెట్టే విషయంలో నాణ్యత ప్రమాణాలు లోపించడంతో నోటీసులు జారీ చేసినట్లు ఇన్‌ఛార్జి డైరెక్టర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. ట్రిపుల్ ఐటిలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్య పర్యవేక్షణ కోసం పరిపాలనాధికారి లక్ష్మణరావు, విద్యార్థుల భాగస్వామ్యంతో టీమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వంట, నిత్యావసర సరుకుల పరిశీలనలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా మంజూరైన గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి (డిఎల్‌పిఒ) మహ్మద్ రజాఉల్ల అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మన ఇల్లు – మన గౌరవం కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులతో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా మంజూరైన ఇళ్లను త్వరిత గతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ సిబ్బందిని ఆదేశించారు.

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సుపరిపాలనే ధ్యేయంగా అభివృద్ధి, సంక్షేమాలను కూటమి ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు 15వ డివిజన్ జలాపహరేశ్వర స్వామి కాలనీలో చిరంజీవి బస్టాండ్ పక్కన బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంఎల్ఎ మాట్లాడుతూ కేవలం ఓట్ల కోసమే రాజకీయాలు కాదని ప్రజాశ్రేయస్సు కోసమేనని తెలియజెప్పేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు.

చింతలపూడి : మండలంలోని ప్రగడవరంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు ఆధ్వర్యంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 172 బూత్ కన్వీనర్ చక్రపు మారేశ్వరరావు, కొమ్ము తిరుపతిరావు మాట్లాడారు.

ముసునూరు : మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కిరెడ్డిగూడెం గ్రామ సర్పంచి పులి బళ్ల లక్ష్మీసత్యనారాయణ మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అంటించారు.

భీమడోలు : భీమడోలు మండలంలో స్వచ్ఛతా హి సేవ, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలను సచివాలయాల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు భాగస్వామ్యంతో ఎంపిడిఒ పద్మావతి దేవి బుధవారం నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీలో పారిశుధ్య పరిరక్షణపై వీధి నాటకాలు ప్రదర్శించారు. మార్కెట్లను శుభ్రపరిచారు. సూరప్పగూడెంలో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజులు పాలన సందర్భంగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు.

2న రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపులు ఆపాలని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అక్టోబర్ రెండో తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి కోరారు. ఈ మేరకు బుధవారం కర పత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం కార్మికుల వేతనాలు, ధరలు పెరుగుదలకు అనుగుణంగా పిల్లలకు ఇచ్చే మెనూ ఛార్జీలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాజు, వెంకటేశ్వ రమ్మ, అరుణ, వంశి, రంగబాబు, పుల్లమ్మ పాల్గొన్నారు.

ముసునూరు ఎస్ఐగా రాజారెడ్డి

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు ఎస్ఐగా రాజారెడ్డి నియామితులయ్యారు. ఆయన గతంలో కూడా ఇదే పోలీస్‌స్టేషన్లో ఎక్కువ కాలం ఎస్ఐగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లో వాటి శివారు గ్రామాల్లో కూడా ఎటువంటి అక్రమాలు జరగకుండా చూస్తానని చెప్పారు.

మానవ జీవితంలో కమ్యూనికేషన్‌ది ప్రధాన పాత్ర

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సర్ సిఆర్.రెడ్డి అటానమస్ కళాశాల ఆడియో విజువల్ హాలులో బుధవారం ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్, ఐక్యూ ఎసి సంయుక్త ఆధ్వర్యంలో "ద రోల్ ఆఫ్ కమ్యూనికేషన్ ఇన్ అవర్ లైఫ్, ప్రొఫెషన్ అంశంపై అతిథి ఉపన్యాసాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తిలో 30 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న రిటైర్డ్ లెక్చరర్ బొద్దపాటి చంద్రశేఖర్ రిసోర్స్‌పర్సన్‌గా పాల్గొని మాట్లాడుతూ మన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో కమ్యూనికేషన్ ప్రధాన పాత్ర పోషిస్తుందని, దానికి సరళ భాష, భావ వ్యక్తీకరణ బాగా దోహదం చేస్తుందని చెప్పారు.

దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమడోలు

ఆరోగ్య పరిరక్షణలో దంతాల పాత్ర కీలకమని, భీమడోలుకు చెందిన ప్రముఖ దంత వైద్యులు యు.చాందినిప్రియ అన్నారు. భీమడోలు శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం ప్రిన్సిపల్ డి.సోహిని ఆధ్వర్యంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు,సిబ్బందికి ఉచిత మెగా దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యులు దంతాల పరిరక్షణ, వాటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అంశాల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డి.సోహిని మాట్లాడుతూ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా పాఠశాలలో హెల్దీ ఇండియా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అవసరమైన వారికి మందులను అందించారు.

విధిగా మొక్కలు నాటాలి

మండవల్లి : భూమిపై ఉన్న సమస్త జీవరాశుల మనుగడకు ప్రకృతి సమతుల్యత ఎంతో అవసరమని, అడవులను, చెట్లను కాపాడుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్క రరావు స్పష్టం చేశారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవరాశుల్లో వృక్షాలు ఎంతో ముఖ్యమైనన్నారు. ప్రతిఒక్కరూ విధిగా చెట్లను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో టెంట్ అప్పారావు, బండి దివాకర్, షేక్ మీరావల్లి పాల్గొన్నారు.